క్లుప్తంగా

వాసవీ మాతకు పుష్పాభిషేకం


ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత


పుష్పాభిషేకం

నందికొట్కూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవికి సోమవారం ఉదయం పుష్పాభిషేకం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారికి లలితాహోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆర్య వైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి, వాసవీ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి

పాములపాడు: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు సంజీవరాయుడు, వెంకటేశ్వర రావు, అబ్రహాం కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 20 గ్రామాల ప్రజలు పాములపాడుకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ప్రయాణికులకు నిలువ నీడ లేదన్నారు. బస్టాండ్ నిర్మాణానికి తోడ్పాటు నందించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, సాగు చేసిన రైతులకు కూడా మంచి ఆదాయం వస్తుందని ఏఓ పవన్‌కుమార్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. వారు మాట్లాడుతూ రసాయన రహిత ఆహార ఉత్పత్తుల ద్వారా సమస్యలు తగ్గించుకుని ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ బ్రహ్మయ్య, ఈఓఆర్డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోమల, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం


జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్నా కానిస్టేబుల్ శ్రీకాంత్

శ్రీశైలం : శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శ్రీకాంత్ ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. నంద్యాల జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌లో శ్రీకాంత్ ఆత్మకూరు సబ్ డివిజన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రశంసా పత్రం అందుకున్న శ్రీకాంత్‌ను సోమవారం ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, నంద్యాల జిల్లా కోర్టు మానిటరింగ్ సీఐ చాంద్‌బాషా, శ్రీశైలం సీఐ ప్రసాదరావు, తోటి సిబ్బంది అభినందించారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం


నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరస్వామి ఎదురుగా కొలువైన నందీశ్వరస్వామికి సోమవారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు రఘుశర్మ, ధర్మ తేజ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పీఠార్చన, ద్రవ్యపూజ, పంచామృతాభిషేకం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాభిషేకం నిర్వహించారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు వివిధ సమస్యపై అధికారులకు ఇచ్చే ప్రతి అర్జీని విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

వలసబండి కదిలింది

- కూలీలకు స్థానికంగా పనులు కరువు
- కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు పయనం
- వలసల నివారణకు చర్యలు తీసుకోని ప్రభుత్వం


మినీ లారీలో సామాన్లు ఎక్కిస్తున్న వలస కూలీలు

పాములపాడు: బతుకు జీవుడా అంటూ పనుల కోసం కూలీలు వలస వెళ్తున్నారు. స్థానిక ప్రాంతాల్లో పనుల్లేకపోవడంతో కుటుంబం అంతా వాహనాల్లో ఇతర ప్రాంతాలకు పయనమయ్యారు. రైతులు, రైతు కూలీలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే కడుపు చేత పట్టుకుని, మల్లె మూటె సర్దుకొని బయల్దేరారు. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో పదుల సంఖ్యలో వలస కూలీల వాహనాలు వెళ్లడం నిత్యకృత్యమైంది. సోమవారం పాములపాడులోని ఎస్సీ కాలనీలో సుమారు 40 కుటుంబాలు వాహనాల్లో బయల్దేరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందువల్లే ప్రజలు ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో పనుల్లేక పోవడంతో పాటు కూలీ డబ్బులు కూడా తక్కువగా ఉండడం ఒక కారణంగా ఉంది. కేవలం పనికి వెళ్తేనే పూట గడిచే పరిస్థితులున్న కుటుంబాలు పిల్లా పాపలతో సహా ముల్లే, మూటె సర్దుకొని పయనమయ్యారు. గుంటూరు, దోర్నాల, ఒంగోలు ప్రాంతాల్లో పత్తి, మిర్చి పొలాల్లో పనులు ఉన్నాయని, అక్కడ పనులు చేసుకోవడంతో కొంత డబ్బు మిగుల్చుకోవడంతో పాటు ఆకలి తీర్చుకోగలమని కూలీలు పేర్కొంటున్నారు. ప్రధానంగా కర్నూలు జిల్లాలోని పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి ప్రతి రోజు వేల సంఖ్యలో ప్రజలు పనుల కోసం వలస వెళ్తుండటం గమనార్హం. అధికారంలోకి రాకముందు టీడీపీ ఇచ్చిన హామీల అమలు ఎక్కడా కనిపించడం లేదన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అమ్మకు వందనం పాయె, ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 ఊసే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాయిదాలకే పరిమితమైంది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వం ప్రజల కోసం చేసిందేమిలేదనే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సహకారం కొరవడి, చేతి నిండా పనుల్లేకుంటే వలసలు వెళ్లక తప్పదు మరి.

ఇది పూర్తిగా ప్రభుత్వాల నిర్లక్ష్యమే



ప్రజలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం. పేదరిక నిర్మూలన కోసం ఈ ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయో అర్థం కావడం లేదు. కేంద్రంలో హ్యాట్రిక్ విజయం అని బీజేపీ, 4సార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాడని టీడీపీ జబ్బలు తరుచుకోవడం తప్పా వలసల నివారణకు చేపట్టిన చర్యలు శూన్యం. చదువుకునే పిల్లలను సైతం గత్యంతరం లేక తమ వెంట పనుల కోసం తీసుకెళ్తున్న పరిస్థితులు రాష్ట్రంలో దాపురించాయి. ప్రభుత్వాలు పాలకుల కోసం కాకుండా ప్రజల కోసం ఆలోచన చేయాలి.

–కలబండి అంకన్న, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు

యువకుడి అదృశ్యం


గొల్ల మధు (ఫైల్)

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామానికి చెందిన యువకుడు గొల్ల మధు సోమవారం ఉదయం గడ్డి కోసేందుకు హంద్రీ నీవా కాలువ గట్టుకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులను, తెలిసిన వారిని కుటుంబ సభ్యులు విచారించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి గొల్ల గంగన్న బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

నేడు ప్రత్యేక ఆధార్ నమోదు

బండిఆత్మకూరు : బండి ఆత్మకూరు గ్రామంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో పుట్టిన పిల్లల నుంచి 6 సంవత్సరాల లోపు గల పిల్లలకు ఆధార్ నమోదు చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా మహానందీశుడి పల్లకోత్సవం


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో పుష్యమాసం, బహుళ త్రయోదశిని పురస్కరించుకుని సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు.

కొనసాగుతున్న భక్తజనసందడి

మహానందిలో భక్తజన సందడి కొనసాగుతుంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి స్వామి వారికి ఏకాంతసేవ పూజలను వేదపండితులు రవి శంకర అవధాని ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి



మల్యాల హంద్రీనీవా ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

నందికొట్కూరు: హంద్రీ-నీవా కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేసే విధంగా వెడల్పు చేయాలని సీపీఎం నాయకుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల హంద్రీనీవా ప్రాజెక్టు వద్ద పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, మదనపల్లె జిల్లాలకు చెందిన 6 లక్షలకుపైగా ఎకరాలకు సాగు నీరు అందించే కాలువ హంద్రీ-నీవా అన్నారు. అధికారంలోకి రాగానే కాలువ వెడల్పు చేసి 6.300 క్యూసెక్కుల నీటిని తరలిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేసేందుకు జీవో 404, 405 విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెడల్పు చేయకుండా 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించడం ఎలా సాధ్యమో సమాధానం చెప్పాలన్నారు. పనులు చేపట్టేందుకు రూ.930 కోట్లు విడుదల చేయడంలో అంతర్యమేమిటన్నారు. సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పక్కీర్‌సాహెబ్, కర్ణ, గోపాలకృష్ణ, నాగన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, లక్ష్మన్న, దేవరాజు, గౌడు, బాలకృష్ణ, మాబూని పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

పాములపాడు: స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో 16 నెలలు, మిట్టకందాల గ్రామంలో 26 నెలలు, పాములపాడు 8నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గ్రామాల పారిశుద్ధ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా జీవించాలని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులు నాగన్న, శివలింగం, మునెయ్య పాల్గొన్నారు.

పనిచేయని ఎన్‌ఎంఎంఎస్ యాప్

జూపాడుబంగ్లా: ఉపాధి పనులకు హాజరైన కూలీలకు హాజరు వేసే ఎన్‌ఎంఎంఎస్ యాప్ సోమవారం పనిచేయలేదు. దీంతో మండలంలోని తరిగోపుల, భాస్కరాపురం, జూపాడుబంగ్లా, తాటిపాడు, పి.లింగాపురం, మండ్లెం, పారుమంచాల, పోతులపాడు, తర్తూరు, తూడిచెర్ల గ్రామాల్లో పనిచేసిన 380 మంది ఉపాధి కూలీలకు వేతనం కట్ అయింది. కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలాపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన చెన్నమ్మతల్లి భజన మండలి వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో మమాగణపతిం, శివశివశంకరా, శంభో హరహర మహాదేవ, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, కైలాసగిరివాసా తదితర భక్తి గీతాలు, భజన కీర్తనలను బాలకుల్లాయప్ప, శ్రీనివాసులు, వెంకటరంగారెడ్డి, తిరుపాలరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఆలపించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు


మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ

నందికొట్కూరు: ఎక్సైజ్ శాఖ పరిధిలో మూడు మద్యం షాపులను ఈడిగ, గౌడు కులస్తులకు ప్రభుత్వం కేటాయించిందని ఆ శాఖ ఎస్‌ఐ జప్రుల్లా తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొట్కూరు మున్సిపాలిటీ-1, జూపాడుబంగ్లా మండలం-1, పగిడ్యాల మండలంలో ఒక దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 లక్షలు చెల్లించి ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


మృతుడు మస్తాన్ ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన మస్తాన్(42) అనే రైతు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సోమవారం జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ విచారణ చేశారు. మృతుడి తండ్రి అయ్యన్న, భార్య రాధమ్మను విచారించారు. మృతుడు, అతని తల్లి దండ్రులు కలిసి జీవిస్తుండగా మృతుని తండ్రి అయ్యన్న పేరుపై రెండు ఎకరాల పొలం ఉన్నట్లు గుర్తించారు. మరో నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న, పొగాకు, కంది పంటలు సాగుచేసినట్లు విచారణలో తెలిసింది. పంట సాగు కోసం రూ.8 లక్షలు అప్పులు చేసినట్లు..మృతుని పేరున కౌలుకార్డు లేదని ఏఓ చెప్పారు. అలాగే మృతుని పేరుపై నమోదు కాలేదని ఏఓ వివరించారు. మృతుని తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసి జిల్లా కమిటీకి నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు.

పేదల పక్షాన సీపీఎం పోరాటం

ఆత్మకూరు: దున్నే వానికే భూమి, పేదలకు ఇళ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 276 గ్రామాల్లో భూపోరాటాలు నిర్వహించి, సుమారు 70 వేల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన ఏకైక పార్టీ సీపీఎం అని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు షేక్ ఇస్మాయిల్, ఎ.సురేంద్ర అన్నారు. సోమవారం పట్టణంలోని సుదర్శనవర్మ భవన్‌లో నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరగనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా దేశ భవిష్యత్‌ను యువత మార్చగలదన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

వెలుగోడు: పంటలకు అవసరమైనంత మేరకే యూరియా వాడాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. సోమవారం వెలుగోడు, బొయిరేవుల గ్రామాల్లో రబీలో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి యూరియా వాడడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. మొక్కకు నత్రజని ఇచ్చే ఎరువు అయినప్పటికీ పరిమితికి మించి వేసుకోవడం వల్ల నేల, గాలి కలుషితమవుతుందని చెప్పారు. దీంతో చీడపీడల తాకిడి అధికమవడం, వాటి నివారణకు అధిక వ్యయంతో సాగు ఖర్చు పెరుగుతుందని తెలిపారు. ఫలితంగా రైతులు నష్టాలపాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల మరమ్మతుల కోసం రూ.70 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ మురళీకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని గువ్వలకుంట్ల బైరెప్ప చెరువు, పాలెం చెరువు, సర్వారెడ్డి చెరువు, ఎం.లింగాపురం మొండికట్ట, మల్లెలమ్మ, గోకవరం జి.పుల్లారెడ్డి చెరువులతో పాటుగా మండల కేంద్రానికి చెందిన కనికలమ్మ చెరువులకు మైనర్ ఇరిగేషన్ జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నిధులు మంజూరైన వెంటనే చెరువు కట్టల బలోపేతానికి, పిచ్చి చెట్ల తొలగింపునకు, చెరువుల నుంచి పంటకాల్వల మరమ్మతు పనులు చేపడతామని పేర్కొన్నారు.

రాజకీయ దురుద్దేశంతో తొలగింపునకు యత్నం

జూపాడుబంగ్లా: రాజకీయ దురుద్దేశంతో తనను తొలగించడానికి యత్నించడం సమంజసం కాదని తాటిపాడు వీఓఏ ఉషారాణి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తాను గ్రామంలోని వనిత గ్రామైక్య సంఘంలోని 34 పొదుపు గ్రూపులకు బుక్‌కీపర్‌గా ఏడేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు తనను తొలగించి వారికి అనుకూలమైన వారిని నియమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సోమవారం గ్రామ సచివాలయంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారని చెప్పారు. తాను అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు పొదుపు మహిళలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకుంటానని తెలిపారు. అంతేగానీ రాజకీయ దురుద్దేశంతో తొలగించాలని చూడడం సరికాదన్నారు.

వైన్ షాపులకు గీత కార్మికులు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఉన్న గీత కార్మికులు వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈడిగ, గౌడ్ కులాలకు చెందిన వ్యక్తులు మాత్రమే వీటికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆత్మకూరు-1, కొత్తపల్లి-1, పాములపాడు మండలంలో ఒక్కొక్క షాపు చొప్పున దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. నేటి నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులను ఎక్సైజ్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీన పరిశీలిస్తామని, 7వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు. ఒక్కొక్క వ్యక్తి ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా ఒకటి మాత్రమే ఇస్తామని చెప్పారు.

బెట్టింగ్‌లతో కుటుంబాలను నాశనం చేసుకోవద్దు


నిరంజన్‌వలితో డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు

ఆత్మకూరు: ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ యువతకు సూచించారు. బెంట్టింగ్‌ల కోసం అప్పులు చేసి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన పట్టణానికి చెందిన నిరంజన్‌వలిని ఆత్మకూరు పోలీసులు పట్టుకుని సోమవారం డీఎస్పీ కార్యాలయంలో తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం నిరంజన్‌వలి బెట్టింగ్‌లకు పాల్పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి మిత్రుడికి అందించి, బైకును గౌడ్ సెంటర్‌లో వదిలి విజయవాడకు వెళ్లాడన్నారు. పగలంతా నగరంలో తిరుగుతూ రాత్రి అక్కడి ఆర్టీసీ బస్టాండులో నిద్రించేవాడని, ఆదివారం ఓ ఆటో తగిలి అపస్మారక స్థితిలో ఉండగా వివరాలు తెలుసుకున్న అక్కడి పోలీసులు సమాచారం అందించారన్నారు. వాస్తవానికి నిరంజన్‌వలి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పులు చేసి తల్లిదండ్రులతో కట్టించేవాడన్నారు. వివిధ మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకున్న సీఐ రాము మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టి సిబ్బందిని విజయవాడకు పంపి యువకుడిని ఆత్మకూరుకు రప్పించారన్నారు. కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐని అభినందించారు. కార్యక్రమంలో నందికొట్కూరు, శ్రీశైలం సీఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మినుము రైతులకు మద్దతు ధర కల్పించాలి


పంటను పరిశీలిస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ముందు రైతులకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఎందుకు కల్పించడం లేదని అఖిల భారత్ కిసాన్ మహాసభ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. సోమవారం పట్టణ సమీపంలోని పగిడ్యాల రోడ్డు వైపు రైతులు వేసిన మినుము పంటను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, కంది, మిరప, ఉల్లి, పొగాకు తదితర పంటలు వేసి అతివృష్టితో నష్టపోయిన రైతన్నలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ఏసన్న, సుధాకర్, శాలుమియా, కార్మిక సంఘం నాయకులు సుగరాజు, సుధాకర్, రామకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత


ట్రాక్టర్ దోజర్‌తో గోతుల్లో మట్టిని చదును చేస్తున్న దృశ్యం

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ పాఠశాలల ప్రధాన రహదారిలో ఉన్న గోతులను మట్టి వేసి పూడ్చివేశారు. సోమవారం సర్పంచ్ మేకల భాగ్యమ్మ మాట్లాడుతూ.. ఈ రహదారి గుంతలమయంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుందన్నారు. దీంతో కొంత వరకైనా సమస్యను పరిష్కరించేందుకు మట్టిని తోలి గోతులను పూడ్చే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

యూటర్న్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో

జూపాడుబంగ్లా: ఎన్‌హెచ్ 340సీ నిర్మాణంలో భాగంగా తంగడంచ చెక్‌పోస్టు వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని పారుమంచాల, తూడిచెర్ల, తంగడంచ, పి.లింగాపురం, తదితర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు సోమవారం తంగడంచ చెక్‌పోస్టు వద్ద కేజీ రోడ్డుపై రాస్తారోకో చేశారు. డివైడర్ నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకుని హైవే అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పారుమంచాల రోడ్డుకు రాకపోకలు జరిగేలా యటర్న్ నిర్మింపజేస్తామని పేర్కొనడంతో శాంతించారు. తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, సీపీఎం పార్టీ నాయకుడు కర్ణ, పారుమంచాల గ్రామస్తులు దేవసహాయం, రసూల్, కలీముల్లా పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు

బండిత్మకూరు: మండల పరిధిలోని రామాపురం, సంత జూటూరు గ్రామాల్లో సోమవారం మండల పశు వైద్యాధికారులు డా.అనూష, డా.గౌసియా ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో పశువులకు చూడి పరీక్షలు, గొడ్డు మోతు పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు బాహ్య పరాన్న జీవులు సోకకుండా మందులు స్ప్రే చేశారు. గొర్రెలకు, కోళ్లకు టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీఓ సాయి చంద్, వెటర్నరీ అసిస్టెంట్లు శశిధర్, షేక్ మహబూబ్ బాషా, లక్ష్మి ప్రసన్న, సమీరా పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరాలు

మంగళవారం పెద్ద దేవళాపురం, ఎ. కోడూరు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు అనూష, గౌసియా తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మహిళా ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పాములపాడు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ సురేష్ బాబు అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి మహిళా ఉద్యోగులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని వారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ఇంటి నుంచి వాహనంపై బయల్దేరే ముందు తమకు ఒక కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వాహనాలపై ఉన్న చలాన్లను చెల్లించకుండా సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఏసయ్య, హెడ్ కానిస్టేబుల్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న వైద్యులు

నందికొట్కూరు: పింఛన్ లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లతో పాటు ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దామగట్ల, 10 బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల్లో డాక్టర్ ఎల్లోజి, కొణిదేల, శాతనకోట, మల్యాల, నాగటూరు, కోనేటమ్మపల్లి, అల్లూరు గ్రామాల్లో వైద్యుడు నాగార్జునరెడ్డి పరిశీలించారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ. 15 వేలు పింఛన్ పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి, సదరం సర్టిఫికెట్లను రెండు వైద్య బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాయని.. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.